థాణా ముందు ఎమ్మెల్యే ధర్నా

- తప్పుడు కేసు పెట్టారని ఆరోపణ
- బిల్ కలెక్టర్‌పై కేసు నమోదు

చంచల్‌గూడ: విద్యుత్ శాఖ బిల్ కలెక్టర్‌పై కుర్మగూడ ఎంఐఎం కార్పొరేటర్ మహపారా సోదరులు దాడి చేసిన ఘటనలో వారిపై మాదన్నపేట పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ విషయం తెలుసుకున్న యాకుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, కార్పొరేటర్లు సమీనా బేగం, ముజఫర్ హుస్సేన్‌లు కార్యకర్తలతో మంగళవారం అర్ధరాత్రి మాదన్నపేట థాణాకు చేరుకుని ధర్నా నిర్వహించారు. బిల్ కలెక్టర్ రజనీష్ వ్యవహార శైలి బాగా లేదని, కార్పొరేటర్ తల్లితో దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. సరిగా దర్యాప్తు చేయకుండా ఎస్‌ఐ.. ఎంఐఎం కార్యకర్తలపై తప్పుడు కేసు బనాయించారని ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేటర్ సోదరుడు షఫత్ అలీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రజనీష్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎట్టకేలకు శాంతించిన ఎమ్మెల్యే నాయకులు, కార్యకర్తలతో వెనుదిరిగారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం


లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బలాల

మలక్‌పేట: ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా కృషి చేస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. పంజేషా హాలోని కార్యాలయంలో బుధవారం సైదాబాద్, అంబర్‌పేట, చార్మినార్ మండలాల పరిధిలోని శంకేశ్వర్‌బజార్, జయనగర్ కాలనీ, గాంధీనగర్, ఎల్‌సీహెచ్ కాలనీ, అక్బర్‌బాగ్, ఆజంపురా, ఓల్డ్‌మలక్‌పేట చంచల్‌గూడ, కట్టెలగూడ, ఉస్మాన్‌పురా, షాహకాలనీ ప్రాంతాలకు చెందిన 100 మందికి షాదీ ముబారక్, 11 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. లబ్ధిదారులకు పంపిణీ చేసిన చెక్కుల విలువ రూ. 1,11,12,876 లు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ అధికారులు, మజ్లిస్ నాయకులు పాల్గొన్నారు.

మార్కెట్‌లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తాం

చాదర్‌ఘాట్: మలక్‌పేటలోని హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి సీజన్ నేపథ్యంలో రైతులు, హమాలీలు, చాట్ కార్మికుల కోసం చలివేంద్రాలు ఏర్పాటు చేస్తామని వ్యవసాయ శాఖ మార్కెట్ పర్సన్ ఇన్‌చార్జ్ (మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్) ఇఫ్తాకార్ నజీబ్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, అందుకు వ్యాపారులు, సహాయ సహకారాలు అందించాలని సూచించారు. మిర్చి రైతులకు గిట్టుబాటు ధర లభించేలా అధికారులు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో మార్కెట్ ఎస్‌జీఎస్ దామోదర్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో దోమల నివారణ

లింగోజిగూడ: పరిసరాల పరిశుభ్రతతో దోమలను అరికట్టవచ్చని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాంగ్రెస్ పార్టీ జీహెచ్‌ఎంసీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ దర్పల్లి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్ చెరువును ఆనుకొని ఉన్న గ్రీన్‌పార్క్ కాలనీ , తపోవన్ కాలనీల వద్ద బుధవారం సుమారు 150 మంది పారిశుద్ధ్య, ఎంటామాలజీ సిబ్బందితో కలిసి పారిశుద్ధ్యం, దోమల నివారణపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు.ఈ డ్రైవ్‌ను ఎల్‌బీనగర్ సర్కిల్ డీసీ దశరథ, శానిటేషన్ డీఈ వెంకటేశ్వర్లతో కలిసి రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డివిజన్‌ను పారిశుద్ధ్యంలో ఆదర్శంగా తీర్చిదిద్దుతానని, కాలనీలలో ఎక్కడా కూడా చెత్త ఉండకుండా ఎప్పటికప్పుడు ఎత్తివేయాలని సిబ్బందికి సూచించారు.కాలనీలో ఎలాంటి సమస్యలు ఉన్న వెంటనే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

చైతన్యపురి కొత్త సీఐకి శుభాకాంక్షలు


సీఐకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఉపేందర్‌రెడ్డి తదితరులు

దిల్‌సుఖ్‌నగర్: చైతన్యపురి పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర్లును బుధవారం రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపి శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో డీఐ నాగరాజు, సురేష్, శ్రీనివాస్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, ఇస్మాయిల్, మాచర్ల వరుణ్, కాశిదాసు, విప్లవ్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం...

వనస్థలిపురం: వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బోరోజు రవికుమార్‌ను తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం నాయకులు బుధవారం కలిసి సత్కరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వింజమూరు రాఘవాచారి, కార్యదర్శి రాగిఫణి సతీష్‌కుమార్, సహాయ కార్యదర్శి పాతకమూరి రమేష్‌చారి, సభ్యులు ముత్తోజు బ్రహ్మచారి, లక్ష్మణ్‌చారి, వన్నోజు సాయిప్రకాష్ పాల్గొన్నారు.

ఎల్‌బీనగర్‌లో టీజేఎస్ నిరసన

మన్సూరాబాద్: కోదండరాంపై కేసీఆర్ కుట్రలు చేయడం కొత్తేమీ కాదని, గత తొమ్మిదేళ్లుగా అనేక రకాలుగా దాడులకు పాల్పడ్డారని, కేసీఆర్‌ను ప్రజలు ఛీదరించుకున్నా ఇంకా బుద్ధిరాలేదని టీజేఎస్ ప్రధాన కార్యదర్శి పల్లె వినయ్ కుమార్ అన్నారు. తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఎమ్మెల్సీ ఎన్నికను అడ్డుకోవడాన్ని నిరసిస్తూ పార్టీ కార్యకర్తలు బుధవారం ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డులోని శ్రీకాంతా చారి విగ్రహం ముందు నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో టీజేఎస్ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ధార సత్యం, కేవీ రంగారెడ్డి, యువజన సమితి కోఆర్డినేటర్ కొత్తరవి, జిల్లా అధ్యక్షుడు కార్తీక్‌రెడ్డి, నాయకులు ప్రశాంత్, శేఖర్‌యాదవ్, జంగయ్య, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖాధికారులపై ఏసీబీ డీజీకి ఫిర్యాదు

సైదాబాద్: విద్యార్థుల్లో వృత్తి విద్యా నైపుణ్యాలను పెంచాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం పీఎం శ్రీ పథకం కింద చేపట్టిన ఒకేషనల్ స్కూళ్ల లక్ష్యాలను తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ అధికారులు నీరుగారుస్తున్నారని హైకోర్టు న్యాయవాది రాపోలు భాస్కర్ ఆరోపించారు. ఒకేషనల్ స్కూళ్ల ఏర్పాటులో అక్రమాలకు పాల్పడిన అడిషనల్ స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, జాయింట్ డైరెక్టర్లపై విచారణ జరిపించి తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డీజీకి ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు. బుధవారం సైదాబాద్ డివిజన్ కల్యాణ్‌నగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం కింద 2016లో తెలంగాణలో 450 ఒకేషనల్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసిందన్నారు. అయితే కేవలం 350 స్కూళ్లను ఏర్పాటు చేసి అధికారులు వందల కోట్ల రూపాయలు డ్రా చేశారని ఆరోపించారు. ఈ స్కూళ్లను కూడా ఎలాంటి నైపుణ్యాలు లేని ప్రైవేట్ కంపెనీకి ముట్టజెప్పి ప్రభుత్వ ఆదేశాలను విద్యాశాఖ అధికారులు తుంగలో తొక్కారని విమర్శించారు. విద్యాశాఖ అధికారుల అవినీతిపై విచారణ చేపట్టాలని ఏసీబీ డీజీని కోరామని ఆయన తెలిపారు. సమావేశంలో న్యాయవాదులు డాక్టర్ ప్రసంగి, దీనా పాల్గొన్నారు.

స్థలం స్వాధీనంపై పోలీసుల నిర్లక్ష్యం

- హోంమంత్రి ఆదేశాలు బేఖాతర్
- జైళ్ల శాఖ స్థలంలో కబ్జాదారుల అక్రమ నిర్మాణం
- పట్టించుకోని టౌన్‌ప్లానింగ్, పోలీసు అధికారులు


సైదాబాద్‌లో జైళ్ల శాఖ స్థలంలో అక్రమ నిర్మాణం

చంచల్‌గూడ: అది దాదాపు మూడు కోట్ల విలువైన ప్రభుత్వ స్థలం.. తెలంగాణ జైళ్ల శాఖకు చెందిన ఈ స్థలం నిరుపయోగంగా ఉండటంతో డీసీపీ కార్యాలయ భవన నిర్మాణం కోసం పోలీసు శాఖకు అప్పగిస్తే పూర్తిగా స్వాధీనం చేసుకోలేని దుస్థితిలో ఆ శాఖ అధికారులు ఉన్నారు. జైళ్ల శాఖకు చెందిన ఈ స్థలాన్ని నకిలీ పత్రాలు సృష్టించిన కబ్జాదారుల చెర నుంచి విడిపించాలని స్థానిక ఎమ్మెల్యే కోరినా ఫలితం లేకుండాపోయింది. వివరాలు... మలక్‌పేట నియోజకవర్గంలోని సైదాబాద్ డివిజన్‌లోని ప్రధాన చౌరస్తాలో తెలంగాణ జైళ్ల శాఖకు 300 గజాల పై చిలుక స్థలం ఉంది. చాలా ఏళ్లుగా నిరుపయోగం ఉంది. ఇదే అదనుగా కొందరు వ్యక్తులు నకిలీ పత్రాలు సృష్టించి విలువైన స్థలాన్ని కబ్జా చేశారు. విషయం తెలుసుకున్న మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అసెంబ్లీలో చర్చించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. తక్షణమే స్పందించిన అప్పటి హోంమంత్రి మహమూద్ అలీ సదరు స్థలాన్ని స్వాధీనం చేసుకుని పోలీసు శాఖకు అప్పగించి నూతన సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయం భవన నిర్మాణానికి కేటాయిస్తామని వెల్లడించారు.

హోంమంత్రి ప్రకటనతో పోలీసు శాఖకు స్థలం...

డీసీపీ కార్యాలయ నిర్మాణానికి ఈ స్థలం అప్పగించాలని హోంమంత్రి జైళ్ల శాఖ ఉన్నతాధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని జైళ్ల శాఖ సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీకి లేఖ పంపింది. మొత్తం స్థలంలో డీసీపీ కార్యాలయం నిర్మించాల్సిన పోలీసు శాఖ సగం స్థలంలో మాత్రమే కార్యాలయం నిర్మాణం చేపట్టింది. ఇదే అదనుగా కబ్జాదారులు మిగతా స్థలంలో అక్రమంగా జీ+5 భవన నిర్మాణం చేపట్టారు. జైళ్ల శాఖ స్థలాన్ని ప్రైవేటు వ్యక్తులు తమ ఆధీనంలోకి తీసుకుని అక్రమ నిర్మాణం చేపట్టారు. ఈ విషయాన్ని బీజేపీ నేత, కుర్మగూడ మాజీ కార్పొరేటర్ సహదేవ్‌యాదవ్ జైళ్ల శాఖ డీజీ, సూపరింటెండెంట్‌లకు ఫిర్యాదు చేశారు.

సగం..సగం సెటిల్‌మెంట్....

జైళ్ల శాఖ స్థలం పోలీసు శాఖకు అప్పగిస్తూ జైళ్ల శాఖ సౌత్‌ఈస్ట్ డీసీపీకి లేఖ ఇచ్చినప్పటికీ స్వాధీనం చేసుకోవడంలో నిర్లక్ష్యం చేశారు. స్థలం కబ్జా, అక్రమ నిర్మాణానికి సంబంధించి చంచల్‌గూడ సూపరింటెండెంట్ సైదాబాద్ పోలీసులకు, జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ శాఖలకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తును మధ్యలో ముగించారు. నామమాత్రంగా నోటీసులు ఇచ్చిన టౌన్‌ప్లానింగ్ శాఖ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావిస్తోంది. స్థలాన్ని పోలీసు శాఖ స్వాధీనం చేసుకోవాలని లేఖ రాసి జైళ్ల శాఖ చేతులు దులుపుకుంది.

అక్రమ నిర్మాణంపై స్పందించని టౌన్‌ప్లానింగ్...

తిలా పాపం తలో పిడికెడు అన్నట్లు మారింది టౌన్‌ప్లానింగ్ నిర్వాకం. తాము పోలీసు శాఖకు అప్పజెప్పిన స్థలంలో దాదాపు సగం స్థలంలో అక్రమార్కులు కబ్జా చేసి నిర్మాణాలు చేస్తున్నారని చంచల్‌గూడ జైలు సూపరింటెండెంట్ టౌన్‌ప్లానింగ్ శాఖకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం. ఒక ప్రభుత్వ శాఖ ఇచ్చిన ఫిర్యాదుపై టౌన్‌ప్లానింగ్ ఇంత నిర్లక్ష్యం వహించడంపై ఆ శాఖ అసమర్థతను సూచిస్తోందని జైళ్ల శాఖ అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. శాఖల మధ్య సమన్వయలోపంతో విలువైన స్థలం కబ్జాదారుల చెరలోకి వెళ్లిపోతోంది.

సీఎం దృష్టి సారించాలి



సైదాబాద్ చౌరస్తాలోని జైళ్ల శాఖ స్థలంలో నూతన డీసీపీ కార్యాలయం నిర్మిస్తామని గత ప్రభుత్వంలో అప్పటి హోంమంత్రి మహమూద్ అలీ అసెంబ్లీ సాక్షిగా తెలిపారు. కానీ సగం స్థలంలో డీసీపీ ఆఫీసు నిర్మించి మిగతాది కబ్జాదారుడికి వదిలేశారు. జైళ్ల శాఖ స్థలం కబ్జా చేసి అక్రమ నిర్మాణాలు చేపట్టారని గుర్తించి గత జూన్‌లో తెలంగాణ జైళ్ల శాఖ డీజీ, చంచల్‌గూడ సూపరింటెండెంట్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాను. అంతటితో ఆగిన అక్రమ నిర్మాణం మళ్లీ మొదలు కావడం ఆశ్చర్యానికి గురి చేస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి వద్దనే హోం శాఖ ఉంది కాబట్టి తక్షణమే ఈ వ్యవహారంపై విచారణకు డీజీపీ, నగర కమిషనర్‌కు ఆదేశాలు జారీ చేసి ప్రభుత్వం స్థలాన్ని రక్షించాలి. అక్రమ కట్టడాన్ని స్వాధీనం చేసుకుని పోలీసు శాఖ వినియోగంలోకి తేవాలి.

– సహదేవ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్

ఆలయానికి ఆటంకం లేకుండా స్టీల్‌బ్రిడ్జి నిర్మించాలి

- సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీకి కార్పొరేటర్ వినతి


డీసీపీకి వినతిపత్రం ఇస్తున్న కార్పొరేటర్ అరుణా రవీందర్‌రెడ్డి

సైదాబాద్: భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా పురాతన ఆలయానికి ఆటంకం లేకుండా సైదాబాద్ ప్రధాన రహదారిపై స్టీల్‌బ్రిడ్జి నిర్మించాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణా రవీందర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు బుధవారం ఆమె బీజేపీ నాయకులతో కలిసి సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ డి.జానకిని ఆమె కార్యాలయంలో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, చంచల్‌గూడ ఫైర్‌స్టేషన్ నుంచి సంతోష్‌నగర్ వరకు చేపట్టే స్టీల్‌బ్రిడ్జిని సైదాబాద్ ప్రధాన రహదారిపై ఉన్న పురాతన హనుమాన్ ఆలయానికి ఎలా ఇబ్బంది కలుగకుండా నిర్మిస్తామని 2020లో అధికారులు హామీ ఇచ్చారని తెలిపారు. అయితే ఇటీవల నిర్మాణాన్ని పరిశీలిస్తే అది ఆలయం పైనుంచి వెళ్తున్నట్టు తెలుస్తోందన్నారు. ఇలా నిర్మించడం భక్తులకు తీవ్ర మనస్తాపానికి గురి చేస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు బ్రిడ్జి నిర్మాణంలో రీ అలైన్‌మెంట్ చేయాలని కార్పొరేటర్ కోరారు. డీసీపీని కలిసిన వారిలో జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, మాజీ కార్పొరేటర్ సహదేవ్ యాదవ్, వినయ్ కిషోర్ యాదవ్ ఉన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటిద్దాం.. ప్రమాదాలు నివారిద్దాం


నాగోలు ఆర్టీఓ కార్యాలయంలో మాట్లాడుతున్న జేటీసీ రమేష్

నాగోలు: స్కూల్ బస్సు డ్రైవర్లు పాఠశాల విద్యార్థులు బస్సు ఎక్కేటప్పుడు, దిగేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని జాయింట్ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ సి.రమేష్ అన్నారు. నాగోలు ఆర్టీఓ కార్యాలయంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు సందర్భంగా బుధవారం భారీ వాహన డ్రైవర్లకు, స్కూల్ బస్సు డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న జేటీసీ రమేష్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపరాదని, హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడపవద్దని సూచించారు. అందరూ ట్రాఫిక్ రూల్స్‌ను పాటించి రోడ్డు ప్రమాదాలను నివారిద్దామని అన్నారు. హెల్మెట్ ధారణ–ప్రాణానికి రక్షణ అని తెలిపారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. నాగోలు ఆర్టీఓ జి.సురేష్‌రెడ్డి మాట్లాడుతూ, అధిక వేగంతో వాహనాలు నడపరాదన్నారు. ముందుగా బయలు దేరి సమయానికి సురక్షితంగా చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్టీఓ సిబ్బంది శ్రీనివాస్, జీఆర్ రాజు, రవీందర్‌రెడ్డి, శీతల్ చవ్హాన్, స్వప్న, రఘుకుమార్, మానస, అనిత, సత్యనారాయణ, రిటైర్డ్ ఆర్టీఓ విజయపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

'సింగరేణి కార్మికుల వైద్య సదుపాయాలపై నిర్లక్ష్యం'

నాగోలు: సింగరేణి యాజమాన్యం కార్మికులకు వైద్య సదుపాయాలు కల్పించడంలో నిర్లక్ష్యం చేస్తోందని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమం సంఘం అధ్యక్షుడు దండం రాజు రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి బుప్పెల్లి బానయ్య, ఉప ప్రధాన కార్యదర్శి ఆలందార్ వేణుమాధవు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మందమర్రి డివిజన్లలో పనిచేస్తున్న బొడ్డు కుమారస్వామి అనే కార్మికున్ని రామకృష్ణ పూర్ ఏరియా హాస్పిటల్ నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ హాస్పిటల్‌కు తరలిస్తే అక్కడ పడకలు ఖాళీ లేవని రోగిని బయటే ఉంచేశారన్నారు. వెంటనే అతని భార్య సామాజిక మాధ్యమాల ద్వారా సింగరేణి చైర్మన్–మేనేజింగ్ డైరెక్టర్‌కు విన్నవించుకోవడంతో యాజమాన్యం స్పందించి వేరే కార్పొరేట్ హాస్పిటల్ కు తరలించడంతో గండం గడిచిందన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రోగిని సింగరేణి ఏరియా హాస్పిటల్ నుంచి తరలించకముందే హైదరాబాద్‌లోని ఏ కార్పొరేట్ హాస్పిటల్‌లో పడకలు ఖాళీగా ఉన్నాయో తెలుసుకొని ఆ ఆసుపత్రికి పంపాలని సూచించారు.

భారీ వాహనాల జాబితా నుంచి ట్రాక్టర్లను తొలగించాలి


సైదాబాద్‌లో నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న ట్రాక్టర్ డ్రైవర్లు

సైదాబాద్: మూడు కమిషనరేట్ల పరిధిలో పగటి వేళల్లో నో ఎంట్రీ విధించిన భారీ వాహనాల జాబితా నుంచి ట్రాక్టర్లను తొలగించాలని శ్రీరేణుకా ఎల్లమ్మ ట్రాక్టర్స్ యూనియన్ అసోసియేషన్ అధ్యక్షుడు అలకుంట్ల భగవంత్ పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. పగటి పూట ట్రాక్టర్ల రాకపోకలను నిషేధించటాన్ని నిరసిస్తూ బుధవారం పలువురు ట్రాక్టర్ డ్రైవర్లు తమ ట్రాక్టర్లతో సరూర్‌నగర్ నుంచి సైదాబాద్ వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగరవాసులకు పలు రకాల రవాణా సేవలందిస్తున్న ట్రాక్టర్లపై డ్రైవర్లు సహా పలువురు కూలీలు జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. పగటిపూట రాకపోకల నిషేధాన్ని సాకుగా చూపించి ట్రాఫిక్ పోలీసులు తమ ట్రాక్టర్లకు పెద్ద మొత్తంలో చలాన్‌లు విధిస్తున్నారని, పలు ట్రాక్టర్లను సీజ్ కూడా చేశారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవనోపాధి దెబ్బతినకుండా పోలీస్ ఉన్నతాధికారులు తగిన నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. నిరసనలో అసోసియేషన్ ప్రతినిధులు కొడదల శ్రీను, నాగయ్య, బొంతు శ్రీను, వెంకన్న, ఎల్లయ్య పాల్గొన్నారు.

వైద్య శిబిరాలకు విశేష స్పందన

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని పలు కాలనీల్లో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాలకు స్థానికుల నుంచి విశేష స్పందన లభించింది. పల్లవి విద్యా సంస్థల ఆధ్వర్యంలో బీజేపీ నాయకుడు మల్క కొమురయ్య పద్మావతి కాలనీలో నిర్వహించిన శిబిరంలో వందల సంఖ్యలో స్థానికులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు. వారికి కమలా ఆసుపత్రి డాక్టర్లు వైద్య సేవలందించారు.

ముదిరాజ్ సంఘం వద్ద...

స్థానిక వివేరా ఆసుపత్రి వైద్యులు హయత్‌నగర్ ముదిరాజ్ సంఘం వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వారికి వైద్య పరీక్షలు చేయడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

పెద్దమ్మ ఆలయం వద్ద...

హయత్‌నగర్ పెద్దమ్మ ఆలయం వద్ద కామినేని ఆసుపత్రి వైద్యులు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్థానికుల నుంచి మంచి స్పందన లభించింది. ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

రైతు బజార్లలో కూరగాయల ధరలు

వనస్థలిపురం: సరూర్‌నగర్/ వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు... (కిలో... రూపాయల్లో) టమాటా 21, వంకాయ 13, బెండ 45, పచ్చిమిర్చి 40, కాకర 38, బీర 45, క్యాబేజీ 23, ఫ్రెంచిబీన్స్ 35, క్యారెట్ 20, దొండ 23–35, చిక్కుడు13–35, గోకర 45, బీట్‌రూట్ 17, క్యాప్సికం 50, ఆలు 19–21, దోస 19, సొర 11, పొట్ల 13, ఉల్లిగడ్డ 18, చామగడ్డ 55. గురువారం ఉదయం 9 గంటల వరకు మాత్రమే ఈ ధరలు అమలులో ఉంటాయి.

చెరువులో మురుగు నీరు నిల్వకుండా చర్యలు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

చంపాపేట: డివిజన్ పరిధిలోని బైరామల్‌గూడ చెరువులో మురుగు నీరు నిల్వ కుండా ప్రత్యేక చర్యలు చేపట్టనున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. మురుగు కూపంగా మారిన చెరువును రెండు రోజుల క్రితం ఆయన పరిశీలించిన ఆయన భూగర్భ డ్రైనేజీ జంక్షన్‌లో పేరుకునిపోయిన చెత్తను తొలగించాలని ఆదేశించారు. బుధవారం ఆయన మరోమారు చెరువు ప్రాంతాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి జంక్షన్‌లో చెత్తను తొలగించటంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ, త్వరలో చెరువులో మురుగు నీటిని జేసీబీ సహాయంతో తొలగించటంతో పాటు చెరువు పరిసరాలను శుభ్రం చేసేందుకు, డ్రైనేజీ జంక్షన్‌లో మురుగు నీటి ప్రవాహానికి అడ్డు వచ్చే చెత్తను తొలగించేందుకు ఇద్దరు వ్యక్తులను నియమించనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ పవన్, సర్కిల్ డీసీ దశరథ, ఈఈ కోటేశ్వరరావు, వాటర్ వర్క్స్ అధికారులు సరిత, రమ్య భారతి, నాయకులు నల్లా రఘుమారెడ్డి, కృష్ణమాచారి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది నిర్లక్ష్యంతోనే చెరువులోకి మురుగు: వంగ

ఇరిగేషన్, సర్కిల్ సిబ్బంది నిర్లక్ష్యంతోనే బైరామల్‌గూడ చెరువు మురుగు కూపంగా మారిందని చంపాపేట డివిజన్ కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. చెరువు లోతట్టు కాలనీవాసుల ఫిర్యాదు మేరకు ఆయన దుర్గంధం వెదజల్లే బైరామల్‌గూడ చెరువును పరిశీలించారు. అనంతరం మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ, ఎగువ కాలనీల నుంచి మురుగు నీరు చెరువులోకి ప్రవహించకుండా రెండేళ్ల క్రితమే చెరువు సమీపంలోఓ జంక్షన్ ఏర్పాటు చేసి అక్కడి నుంచి నేరుగా సరూర్‌నగర్ చెరువు వరకు బాక్స్‌టైప్ భూగర్భ డ్రైనేజీ ట్రంక్ లైన్ ఏర్పాటు చేశారన్నారు. అధికారుల పర్యవేక్షణ, నిర్వహణ లోపం వల్లే జంక్షన్‌లో చెత్త పేరుకుపోయి మురుగు నీరు చెరువులోకి చేరుతోందని అన్నారు. అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి చెరువులోకి మురుగు నీరు చేరకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో సర్కిల్ డీఈ రఫీ, ఏఈ సురేష్, సాయినగర్ కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు బాలరాజ్, పెంటయ్య, శ్యాంసుందర్, నాయకులు బాలకృష్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


బైరామల్‌గూడ చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి


చెరువులో పేరుకుపోయిన మురుగునీటిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ వంగ మధుసూదన్‌రెడ్డి

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి: సీఐటీయూ


హస్తినాపురంలో మార్బుల్ కార్మికులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎల్లయ్య

హస్తినాపురం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ఉద్యోగ, కార్మిక, రైతు ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని ఎల్‌బీనగర్ సర్కిల్ సీఐటీయూ కన్వీనర్ ఆలేటి ఎల్లయ్య అన్నారు. వచ్చే ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా నిర్వహించ తలపెట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సాగర్‌రింగ్ రోడ్డులో మార్బుల్ హమాలీ కార్మికులతో కలిసి ఆయన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్లయ్య మాట్లాడుతూ, ఫిబ్రవరి 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో మార్బుల్ హమాలీ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని సమ్మెను విజయవంతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదేళ్లు పూర్తైనా రైతాంగ కార్మికవర్గ ప్రజల సమస్యలు పరిష్కరించలేదన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని ఎల్లయ్య అన్నారు. కార్యక్రమంలో లాట్ల లక్ష్మణ్, హమాలీ కార్మికులు ఎం.రాంచంద్ర యాదగిరి, కె. కృష్ణయ్య, కుమార్‌యాదవ్, బీరయ్య, కృష్ణ, ఎం.శ్రీను , వి.యాదయ్య, రాజు, శ్రీను కానుగుల, వెంకటేశ్, వేముల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.


ఎల్‌బీనగర్ లేబర్ అడ్డా వద్ద సంతకాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

సంతకాల సేకరణ

లింగోజిగూడ: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఫిబ్రవరి 16న చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ కోరారు.సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ఎల్‌బీనగర్ లేబర్ అడ్డా వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేపట్టారు. చంద్రమోహన్ ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నాయకులు లక్ష్మణ్, నరసింహ, రాజు, చెన్నయ్య, బాలరాజు, సాలమ్మ, అలివేలు, లక్ష్మమ్మ, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.